
సాక్షి మంచిర్యాల

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



మెరుగైన వైద్యం అందిస్తున్నాం

సింగరేణి ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు సీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన పలు ఏరియాల్లోని డిస్పెన్సరీలు సందర్శించారు. 8లో▸



వేసవిలో జీవాలు పైలం

వేసవిలో పాడి పశువులు, జీవాలపై జాగ్రత్తలు తీసుకోవాలని కత్తెరసాల పశువైద్యాధికారి సతీశ్ సూచిస్తున్నారు. మేత, దాణా సరిపడా అందించాలని తెలిపారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
38.0 /27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆలయాల అభివృద్ధికి కృషి



భూమి పూజలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

దండేపల్లి: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మండలంలోని నంబాల గ్రామంలో సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు ఐక్యతగా చందాలు పోగు చేయడం, దానికి తోడు దేవాదాయ శాఖ నిధులు మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. నంబాల అభివృద్ధికి నిధులు విడుదల చేస్తామని, ఆలయ అభివృద్ధి కూడా కేటాయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రం హయాంలో జాతీయ రహదారుల నిర్మాణం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూర్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పదకొండేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా జాతీయ రహదారుల నిర్మాణాలు చేపట్టిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 63వ జాతీయ రహదారి జగ్దల్‌పూర్ నుంచి నిజామాబాద్ రోడ్డు పనులు పూర్తయ్యాయని తెలిపారు. నిజామాబాద్ ఆర్మూర్ వయా మంచిర్యాల వరకు రూ.3376 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టిందని తెలిపారు. ఈ పనులు పూర్తయితే మంచిర్యాల నుంచి నిజామాబాద్‌కు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు. శ్రీరాంపూర్ నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి వరకు జాతీయ రహదారి–363 నిర్మాణానికి రూ.2497 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. మంచిర్యాల నుంచి జైపూర్ మీదుగా వరంగల్ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు రూ.2606 కోట్లతో ప్రారంభం అయ్యాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ నిర్మాణం చేపడితే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తామే అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మ శ్రీపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎతం శివకృష్ణ, నాయకులు వంశీగౌడ్, శంకర్, రాజు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి



అంబులెన్స్ సేవలు ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజు

జైపూర్: జాతీయ క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా ఓల్డ్‌ఏజ్ హోమ్స్, భవన కార్మికులు, టీబీ వ్యాధిగ్రస్తులకు ఇంటిలోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్ ద్వారా వైద్యం అందిస్తామని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజు తెలిపారు. జైపూర్ ఆస్పత్రి వద్ద అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. జిల్లాలో 998 మంది టీబీ వ్యాధిగ్రస్తులు వైద్యం పొందుతున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో అంబులెన్స్ ద్వారా వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. వైద్యులు సుధాకర్ నాయక్, ప్రసాద్, ముస్తఫా, జిల్లా అక్షయ ప్రోగ్రాం అధికారి సురేందర్, మాస్‌మీడియా అధికారి వెంకటేశ్వర్, వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో రిక‘వరీ’



ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు(ఫైల్)

- పనుల్లో ఏటా రూ.లక్షల్లో అవకతవకలు
- కింది స్థాయి సిబ్బంది పాత్రే అధికం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు వంద రోజుల పని కల్పించి ఆర్థిక స్థితి మెరుగుపర్చేందుకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో రూ.లక్షలు పక్కదారి పడుతున్నాయి. ఏటా సామాజిక తనిఖీల్లో భారీగా ఆర్థిక తేడాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో అధికారులు, సిబ్బంది గ్రామాల్లో సామాజిక తనిఖీ ప్రజావేదిక సభలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా గుర్తిస్తున్నారు. అయినా అక్రమాలు ఆగడం లేదు. గత ఆర్థిక సంవత్సరం(2024–25)లో మొత్తం రూ.5లక్షలు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. జిల్లాలో ఈ పథకం అమలవుతున్న 16మండలాల్లో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక ఆర్థిక తనిఖీలు మొదలు కానుంది. సోమవారం మందమర్రి మండలంలో ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ఆ ఏడాదిలో జరిగిన ఉపాధి హామీ పథకం నిధుల ఖర్చు, అందులో తేడాలు గుర్తించి సభల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల ముందే వివరిస్తారు. కూలీల హాజరు పని దినాల నుంచి మెటీరియల్ పనులు, ఇతర నిధుల ఖర్చు పారదర్శకంగా జరిగిందా..? లేదా అని గుర్తిస్తారు. ఇక ఆన్‌లైన్‌తోపాటు మాన్యువల్ రికార్డులు పరిశీలిస్తున్నారు.

2024-25లో గుర్తించినవి విలువ (రూ.ల్లో)

మండలం	రౌండ్	గుర్తించింది	మిగిలింది
భీమిని	13	90046	90046
మందమర్రి	14	47387	42848
హాజీపూర్	03	10428	10428
భీమారం	03	15701	15701
కన్నెపల్లి	03	20364	20364
జన్నారం	14	97278	97278
కాసిపేట	14	18166	18166
వేమనపల్లి	14	975	975
జైపూర్	14	41632	41632
చెన్నూరు	14	51131	51131
దండేపల్లి	14	6507	6507
కోటపల్లి	15	26166	26166
లక్సెట్టిపేట	14	44088	44088
నెన్నెల	14	3872	3872
తాండూరు	15	13084	13084
బెల్లంపల్లి	15	14237	14237
మొత్తం		5,00,382	4,95,843

నోట్:మందమర్రి మండలంలో రూ.4,539 రికవరీ అయ్యాయి.

ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి పై స్థాయి వరకు ఎవరు బాధ్యులైతే వారిపై చర్యలు తీసుకుంటారు.

వసూలు అంతంతే..

తనిఖీల్లో గుర్తించిన నిధులపై మళ్లీ రికవరీ మాత్రం అంతంతగానే ఉంటోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి జిల్లా ఏర్పడిన వరకు అత్యధికంగా కొన్ని మండలాల్లో 15వ రౌండ్ వరకు సభలు పూర్తి కాగా, రూ.లక్షల్లోనే నిధుల అవకతవకలు బయటపడ్డాయి. ఇప్పటికీ ఆయా నిధుల రికవరీ పూర్తి కావడం లేదు. గతేడాది పరిశీలిస్తే ఒక్క మందమర్రి మండలంలో రూ.47వేలకుపైగా తేడాలు గుర్తిస్తే, అందులో రూ.4,539 వసూలు అయ్యాయి. మిగతా ఏ మండలంలోనూ పైసా వసూలు కాలేదు. ఈ ఏడాదిలోనూ డబ్బులు తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఏప్రిల్ నుంచే మొదలు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. గతేడాదికి సంబంధించి మొత్తం రూ.5లక్షలకు పైగా గుర్తించగా, ఇందులో ఇంకా రూ.4లక్షలకు పైగా మిగిలి ఉన్నాయి. ఇక అంతకుముందు తనిఖీల్లో గుర్తించిన మొత్తం రూ.లక్షల్లోనే ఉంది. ఏటేటా సామాజిక సర్వేలో అవకతవకలు గుర్తిస్తున్నప్పటికీ ఆ మేరకు రికవరీ జరగడం లేదు.

ప్రజల అవసరాలకే ఇసుక రీచ్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: జిల్లా ప్రజల అవసరాలు తీర్చడానికి ఇందారం వద్ద మరో ఇసుక రీచ్ అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మండలంలోని ఇందారం గోదావరి బ్రిడ్జి వద్ద మైనింగ్ శాఖ ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను సోమవారం ఆయన మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మన ఇసుక వాహనం ద్వారా సరఫరా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు, పంచాయతీ కార్యదర్శి సుమన్ పాల్గొన్నారు.

జిల్లాలో కొత్తగా ఐదు..

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పనులు, ప్రజలు అవసరాలకు సరిపడా ఇసుక లభ్యతకు కొత్తగా ఐదు ఇసుక రీచ్‌లు మంజూరు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముల్కల్ల, వేంపల్లి-1, వేంపల్లి-2, తాళ్లపల్లి, ఇందారం ఇసుకరీచ్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. మైనింగ్ శాఖ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలతో కలిసి ప్రభుత్వ బీసీ బాలుర, బాలికల కళాశాల వసతిగృహాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇంటర్మీడియెట్ విద్యార్థులు గురుండ్ల రవీందర్, ఎస్.అభినయ్‌లను శాలువాలతో సన్మానించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తంనాయక్, ఎస్సీ కార్పొరేషన్ డీడీ దుర్గాప్రసాద్, వసతి గృహ సంక్షేమ అధికారులు మోసీస్ అహ్మద్, సుధాలక్ష్మి పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే లక్ష్యం

- బాల్క సుమన్ హయాంలో ఇసుక దందా
- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



మాట్లాడుతున్న వివేక్, వేదికపై డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, నాయకులు

రామకృష్ణాపూర్: చెన్నూర్ నియోజకవర్గంలో అవినీతి రహిత పాలన అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. బాల్క సుమన్ ఇక్కడ ఎమ్మెల్యేగా ఉండగా ఇసుక దందా విచ్చలవిడిగా సాగిందని, తాను గెలుపొందిన తర్వాత ఇసుక దందాకు అడ్డుకట్ట వేశామని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భీమా గార్డెన్స్‌లో సోమవారం నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. కేసీఆర్ తనకు తన కొడుకు, కూతురికి ఫామ్‌హౌజ్‌లు కట్టించారు తప్ప ప్రజలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. సింగరేణిలో లక్ష ఉద్యోగాలు ఉంటే బీఆర్ఎస్ పాలనలో 60 వేల ఉద్యోగాలు పోయాయని అన్నారు. ఏడాదిన్నర పాలనలో చెన్నూర్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా బాల్క సుమన్ పదేళ్లు ఉన్నా ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని అన్నారు. సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పార్టీ పరిశీలకులు జంగా రాఘవరెడ్డి, రామ్‌భూపాల్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు పాల్గొన్నారు.

మామిడి మద్దతు ధరకు కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్
- మ్యాంగో మార్కెట్‌లో అమ్మకాలు ప్రారంభం



మామిడి కాయల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: మామిడికాయలకు మద్దతు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. సోమవారం బెల్లంపల్లిలో మ్యాంగోమార్కెట్, కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా మామిడి రైతులు మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కష్ట, నష్టాలను రైతులు తన దృష్టికి తేవడంతో క్రయవిక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం ట్రేడర్లతోపాటు ఫ్రూట్ ఎక్స్ కంపెనీతో సంప్రదింపులు జరిపి ఒప్పించినట్లు వివరించారు. రైతులు వివిధ రకాల పండ్ల తోటలు పెంపకం చేపట్టి ఫలసాయాన్ని ఇదే మార్కెట్‌లో అమ్ముకుని లాభాలు గడించవచ్చని సూచించారు. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు పాటు పడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి అనిత, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎండీ.షాబుద్దీన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇంచార్జి కార్యదర్శి ఎస్.భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కారుకూరి రాంచందర్, మాజీ ఎంపీటీసీలు ముడిమడుగుల మహేందర్, హరీష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు బత్తుల రవి, నాతరి స్వామి, ఫ్రూట్ కంపెనీ యజమాని, ట్రేడర్లు, రైతులు పాల్గొన్నారు.

అసత్యపు ఆరోపణలు

- మంచిర్యాల సీడీపీవో విజయలక్ష్మి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల సీడీపీవోగా పనిచేస్తున్న తనపై కొంతకాలంగా కొందరు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని, అంగన్‌వాడీ కేంద్రాలను సమయానుసారంగా తెరిచేందుకు జీపీఎస్ విధానంలో అటెండెన్స్ తీసుకోవడం నచ్చక సత్యదూర ఆరోపణలు చేస్తున్నారని సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు టీచర్లు సమయానికి రాకపోవడం, పిల్లలు తినే సమయానికి వచ్చి కేంద్రాలను తీయడంతో అన్ని కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి మెమోలు ఇచ్చినట్లు తెలిపారు. కొందరు లీడర్లుగా చెప్పుకుంటూ తనను బెదిరించేందుకు ప్రయత్నించారని, అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించి లబ్ధిదారులకు అందాల్సిన పౌష్టికాహారం అందేలా వ్యవహరించడం వల్లనే కొందరు టీచర్లు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మందమర్రికి చెందిన టీచర్ తను నివాసం ఉండే ఇంట్లోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తుండగా, తనకు జీపీఎస్ ద్వారా అటెండెన్స్ సమస్య లేదని, తనపై చేసిన ఒత్తిడితో మృతిచెందిందనే ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు. ఒక అంగన్‌వాడీ టీచర్ తన పేరు చెప్పి అందరి నుంచి డబ్బులు వసూలు చేసిందని, తన దృష్టికి వచ్చి తాను మందలించే సరికి తనపై లేనిపోని ఆరోపణలు ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చిన వాటిలో రూ.2 లక్షలు తాను తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని, ఐదుసార్లు విచారణ చేసిన తర్వాతనే అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. 11మంది అంగన్‌వాడీ టీచర్లను 2011లో కలెక్టర్ ఆదేశాలు లేకుండా నియామకాలు ఇచ్చారని, ఈ అంశం కోర్టు పరిధిలోకి వెళ్లగా, ఇందుకు కారణమైన వారికి కలెక్టర్ ఆదేశాలతో నోటీసులు ఇచ్చిన రోజే తనపై ఫిర్యాదులు చేసి, ఆ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

పరిష్కారంలో అలసత్వం వద్దు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో అధికారులకు సూచనలు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వద్దని, త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

☞ చెన్నూర్ మండలం ఒత్కులపల్లి గ్రామ రైతులు అస్నాద్ శివారులో 55ఎకరాల భూమికి సంబంధించి విరాసత్ పట్టా అమలు చేయాలని దరఖాస్తు అందజేశారు.

☞ మంచిర్యాలకు చెందిన నంద్యాల చంద్రమౌళిరెడ్డి మంచిర్యాల సబ్ రిజిస్ట్రేషన్, రిజిష్టర్ కార్యాలయంలో అక్రమ వసూళ్లు, చట్ట వ్యతిరేక విధానాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

☞ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని, పేదలకు మంజూరు చేయకుండా ఉన్నవాళ్లకే మంజూరు చేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మందమర్రి మండలం కోటేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన తిరుపతి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశాడు.

☞ తన కుమారుడు కొడిత్యాల లక్ష్మీనారాయణకు ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వకుండా మంచిర్యాల కన్సల్టింగ్ ఏజెంటు శ్రీనివాస్, ఆర్టీవో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏడాది నుంచి వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలని మంచిర్యాలకు చెందిన కొడిత్యాల వెంకటశివప్రసాద్ ఫిర్యాదు చేశారు.

జన్నారం: జన్నారం మండలం రేండ్లగూడ గ్రామ వైకుంఠధామం కోసం 1.25ఎకరాలు కొనుగోలు చేశామని, గ్రామానికి చెందిన రాజమౌళి అనే వ్యక్తి అక్రమంగా పట్టా చేయించుకున్నాడని, అక్రమ పట్టా రద్దు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ రవి, మాజీ సర్పంచ్ ఆశరాజ్, ఏఎంసీ డైరెక్టర్ రాజన్న, మాజీ ఎంపీటీసీ వెంకటరాజం కోరారు.

41 కాదు.. 42కిలోలు జోకుతున్నారు..



మొదట కొనుగోలు చేసిన ధాన్యం బస్తాకు 41కిలోల చొప్పున తూకం వేశారు. మిల్లుకుపోయినా లారీ ఇంకా బస్తాలు దించుకోకుండా అక్కడే ఉంది. ఇప్పుడు కొనుగోలు కేంద్రాల్లో 41కిలోలు కాదు 42కిలోలు జోకుతున్నారు. తేమ 15శాతంలోపు వచ్చినా, తూర్పాల పట్టినా, చెత్తాచెదారం లేకుండా చేసినా బస్తాకు 42కిలోల ధాన్యం జోకుతున్నారు. తాలు, తప్ప ఉన్నా, నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చినా అందరికీ ఒకేలా 42కిలోలు తూకం వేస్తున్నారు. క్వింటాల్‌కు నాలుగు కిలో చొప్పున లారీ లోడు ధాన్యానికి రూ.30 వేల వరకు నష్టపోతున్నాం. అధికారులే కిలోకు రెండు కిలోలు జోకాలని ఆదేశాలు ఇస్తున్నారు. ఇదెక్కడి న్యాయం.. నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చిన రైతుల నుంచి తరుగు పేరుతో కోతలు లేకుండా కొనుగోలు చేయాలి.

– రైతులు ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, జే.మల్లేష్, సతీష్, కిష్టాపూర్, జైపూర్

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి



మేము బెల్లంపల్లి పట్టణంలోని బాబుక్యాంపు బస్తీలో నివాసం ఉంటున్నాం. నేను దివ్యాంగురాలిని. నా భర్త కూలీ పని చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాం. స్థలం ఉన్నా ఇల్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేదు. ప్రస్తుతం మా తల్లిగారి ఇంటి స్థలంలో గుడిసె వేసుకొని ఉంటున్నాం. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి.

– ఇరుగురాల సునిత, బెల్లంపల్లి

న్యాయం చేయాలి



మంచిర్యాల మున్సిపాలిటీ పరిధి గర్మిళ్ల శివారులో కొనుగోలు చేసిన 21ప్లాట్లలో ఇటీవల పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన వ్యక్తి ఈ ప్లాట్లలో తనకు 1.25గుంటల భూమి ఉందని జనవరి 1న మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. కంచె వేసుకున్నాడు. తహసీల్దార్, ఆర్డీవోకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలి.

– ప్లాట్ల బాధితులు శ్రీనివాస్, సుమన్, మంచిర్యాల

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి


మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని యాపల్ ప్రాంతంలో జాతీయ రహదారికి ఇరువైపులా పలు కాలనీలు ఉన్నాయి. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తూ మృత్యువాత పడుతున్నారు. ఇప్పటివరకు నలుగురు చనిపోయారు. జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించి ప్రమాదాలు నివారించాలి.

– అబ్బాస్, సాంబమూర్తి, నర్సయ్య, సంతోష్, రాజిరెడ్డి, రవివర్మ, యాపల్

క్రీడల్లో ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడల శిక్షణ శిబిరాలకు పది ప్రాంతాలు గుర్తించినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి వీర్‌రాజ్ తెలిపారు. మే ఒకటి నుంచి జూన్ 6వరకు వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తామని, స్పోర్ట్స్ అథారిటీ నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం 14ఏళ్లలోపు బాలబాలికలు క్రీడల్లో శిక్షణ కోసం నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆటవస్తువులు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పంపించారని, శిబిరాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వేసవి క్రీడా శిక్షణను ఆన్‌లైన్‌లో sat gasctelangana. gov. in గానీ, బాక్సింగ్ కోచ్ చిలువేరు రాజేష్ 9963539234 నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు ఉంటే 7989591308, 8977622148 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. వాలీబాల్ జన్నారంలో ఎండి.యాకూబ్(9441629671), కోటపల్లిలో డి.కమల్(7893066988), అథ్లెటిక్స్ భీమారం మండలం అవడంలో టి.రాంచందర్(8374111694), వేమనపల్లి మండలం నీల్వాయిలో మల్లేశ్(9989257922), కరాటే కాసిపేటలో వి.రవి(7013304470), హ్యాండ్‌బాల్ కోటపల్లిలో జె.కళ్యాణ్(9110364064), ఫుట్‌బాల్ నెన్నెలలో ఎం.వనిత(8121305992), ఖోఖో నీల్వాయిలో మల్లేశ్(9989257922), తైక్వాండో బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాలలో ఎస్.చిరంజీవి(9704084999), బాక్సింగ్ కోటపల్లి మండలం పార్పల్లిలో కే.దేవేందర్(8099150447), కబడ్డీ బి.ప్రేమ్‌కుమార్(9948629677) శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

జిల్లా రిసోర్స్‌పర్సన్లకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలకు హాజరైన రిసోర్స్‌పర్సన్లు

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల్లో మెరుగైన విద్య అందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. వేసవి సెలవుల్లో వివిధ సబ్జెక్టుల్లో శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ మాధ్యమాల్లో బోధనకు జిల్లా రిసోర్స్‌పర్సన్ల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. సోమవారం మంచిర్యాల డీసీఈబీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాలకు రిసోర్స్‌పర్సన్లుగా సేవలు అందించడానికి దరఖాస్తు చేసుకున్న ప్రధానోపాధ్యాయులు, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ కేడర్లకు చెందిన 60 మంది ఉపాధ్యాయులకు ఇంటర్వ్యూలు నిర్వహించింది. వివిధ రకాల ప్రశ్నలకు మెరుగైన స్కోర్ సాధించిన వారిని ఎంపిక చేయనున్నారు. ఆదిలాబాద్ డైట్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, సమగ్రశిక్ష శిక్ష కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ఆయా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్, లెక్చరర్లు శంకర్, కిషోర్‌కుమార్, సురేష్, డీసీఈబీ సెక్రెటరీ మహేశ్వర్‌రెడ్డి, చౌదరి పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 44 మంది ఉపాధ్యాయులను జిల్లా రిసోర్సుపర్సన్లుగా ఎంపిక చేయనున్నారు.

క్లుప్తంగా

అడవిపందుల దాడిలో ముగ్గురికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో కొటగూడలో సోమవారం అడవిపందుల దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. కుమురం రవి, ప్రేమలత, రాజుబాయిలు ఉదయం 10 గంటల ఇంటి ముందు కూర్చొన్నారు. వీరిపై ఒక్కసారిగా అడవిపందులు వచ్చి దాడి చేయగా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రేమలత, రాజుబాయిను మంచిర్యాలకు రెఫర్ చేశారు.

యువ రైతు కూడా..

కోటపల్లి: పంట కాపలా వెళ్లిన యువరైతు అడవి పందుల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని బోరంపల్లికి చెందిన దుర్గం శేఖర్‌కు రాంపూర్ శివారులో వరి పొలం ఉంది. అడవి


గాయపడిన శేఖర్

పందుల బెడద కారణంగా ఆదివారం రాత్రి పంటకు కాపలాగా ఉండేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అడవిపందులు ఒక్కసారిగా అతనిపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి రైతులు వెంటనే చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాన్‌షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా, సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్, శాంతినగర్, చైన్‌గేట్ సమీపంలోని పలు పాన్ షాపుల్లో నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓసీబీ పేపర్స్ లభ్యం కాగా, సాధారణంగా వీటిలో గంజాయితో చుట్టి కాల్చడానికి ఈ పేపర్లు వాడతారని ఏఎస్పీ తెలిపారు. దీనిపై విచారణ చేయిస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ సేవించిన, రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఆర్ ఎస్సై రవి, ప్రొబేషనరీ ఎస్సై జుబీర్, సుప్రియ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నేరడిగొండ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని నారాయణపూర్ పంచాయతీ పరిధిలో గల జాతీయ రహదారి (మహబుబ్ ఘాట్) పక్కన గుర్తు తెలియని మృతదేహం ఉందని పంచాయతీ కార్యదర్శి అనూష సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. దీంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా, కొన్ని రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి మరణించి ఉంటాడని, అతని శరీర భాగాలు కుళ్లిపోయి అవి కూడా కొన్ని పుర్రె, కాలు,నడుము భాగాల ఎముకలు ఉండడంతో సేకరించినట్లు తెలిపారు. కార్యదర్శి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

తప్పుడు పత్రాలతో కొలువులు!

- ఆదిలాబాద్ జిల్లా నివాస ధ్రువపత్రాలతో బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు
- ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నేరడిగొండ మండలాల నుంచి దరఖాస్తులు
- నకిలీ సర్టిఫికెట్లు పొందిన ఇతర రాష్ట్రాల యువకులు
- ఇచ్చోడలో ముగ్గురిపై కేసు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

సునీల్‌యాదవ్ తండ్రి రామనంద్ యాదవ్. అతనికి 2024 డిసెంబర్ 23న బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం వచ్చింది. కాల్ లెటర్‌లో ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్ నివాసిగా అడ్రస్ ఉంది. కానీ ఇతను ఇక్కడ లేకపోవడం, గ్రామం నుంచి బీఎస్ఎఫ్, ఆర్మీలో ఉద్యోగం చేసేవారు లేరని గ్రామస్తులు తెలిపారు. సదరు వ్యక్తి ఇస్లాంనగర్ నుంచి నివాస ధ్రువీకరణ పత్రం పొంది ఉద్యోగంలో చేరడం గమనార్హం.

అభినవ్ యాదవ్ తండ్రి ప్రేమంత్‌హెచ్‌యాదవ్. ఇతడు ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్‌లో ఉంటున్నట్లు 2024 ఆగస్టు 14న నివాస ధ్రువపత్రం కోసం మీసేవ ద్వారా నంబర్(ఆర్‌సీ022411234864) దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు పరిశీలించి రిజెక్ట్ చేశారు. మరోసారి నిజామాబాద్ జిల్లా నుంచి మీ సేవ ద్వారా నంబర్ (ఆర్‌సీ 022511946191) ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు పరిశీలించి గతమార్చి 15న రిజెక్ట్ చేశారు.

ఇచ్చోడ: ఇతర రాష్ట్రాల నిరుద్యోగ యువకులు కొందరు ఆదిలాబాద్ జిల్లా నివాసులుగా తప్పుడు నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలో ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నేరడిగొండ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో నివాసముంటున్నట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు పొందారని సమాచారం. ఈ విషయం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ద్వారా బయటకు రావడంతో విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. తప్పుడు పత్రాలతో ఉద్యోగం పొందిన ముగ్గురిపై ఆదివారం ఇచ్చోడలో కేసు నమోదైంది. ఎస్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు సహాని సురాజ్, డాగ్ విజయ్, విశ్వకర్మలపై కేసులు నమోదు చేశారు.

మీసేవ ద్వారా దరఖాస్తులు

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కొంతమంది నిరుద్యోగ యువకులు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్ గ్రామంలో నివాసముంటున్నట్లు దరఖాస్తులు చేసుకున్నారు. నివాస ధ్రువీకరణ పత్రాల కోసం ఆధార్, రేషన్ కార్డులు పాస్‌ఫోటోతో జిరాక్స్ పత్రాలు జతచేసి మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి మీసేవ ద్వారా ధ్రువీకరణపత్రం జారీ చేస్తారు. కానీ ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తప్పుడు ఆధార్, రేషన్ కార్డులను సృష్టించి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.


ఇస్లాంనగర్ నుంచి దరఖాస్తు చేసుకున్న ఇతర రాష్ట్రాల యువకుల జాబితా

భారీగా దరఖాస్తులు

ఇచ్చోడ మండలంలో భారీగా దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. 2024 జూలై నుంచి 2025 ఫిబ్రవరి వరకు ఒక్క ఇస్లాంనగర్ గ్రామం నుంచే 189 మంది యువకులు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంతమంది దరఖాస్తులు చేసుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇస్లాంనగర్ గ్రామ పంచాయతీ గతంలో కొకస్‌మన్నూర్ పంచాయతీలో ఉండేది. ఇటీవల సాథ్‌నంబర్, ఇస్లాంనగర్ గ్రామాలు కలిసి నూతన పంచాయతీగా ఏర్పాటైంది. ఇస్లాంనగర్‌లో మొత్తం జనాభా మూడు వందల లోపు ఉంటుంది. ఇక్కడ ఉన్నత చదువులు చదువుకున్న వారిని సైతం వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. ప్రస్తుతం ఇస్లాంనగర్‌లో ప్రభుత్వ ఉద్యోగం చేసేవారు కూడా లేరు. అధికారులు ఆ దరఖాస్తులను రిజెక్ట్ చేశారే తప్ప, తప్పుడు ఆధార్, రేషన్‌కార్డులు ద్వారా నివాస ధ్రువీకరణపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటున్నట్లు గుర్తించకపోవడం వారి తప్పిదం కనిపిస్తుంది.

రిజెక్ట్ అయిన నంబర్ ద్వారానే మార్ఫింగ్

అధికారులు రిజెక్ట్ చేసిన దరఖాస్తు నంబర్‌తో నివాస ధ్రువీకరణ పత్రాలను మార్ఫింగ్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇతరుల పత్రాన్ని రిజెక్ట్ అయిన దరఖాస్తు పత్రం నంబర్ ఆధారంగా మార్ఫింగ్ చేసే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. గత కొన్నిరోజుల నుంచి మీసేవ కేంద్రాలు ఓటీపీ పద్ధతి ద్వారా నడుస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా ఓటీపీ ద్వారా మీసేవలో లాగిన్ కావచ్చు. ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్‌లో నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువ మంది నిజామాబాద్ జిల్లా మీసేవల నుంచి దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. దరఖాస్తులను రిజెక్ట్ తర్వాత కొందరు మీసేవ నిర్వాహకులు నివాస ధ్రువీకరణ పత్రాలను మార్ఫింగ్ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిస్థాయిలో విచారణ జరిపితే అసలు నిందితులు బయటపడే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటాం

తప్పుడు నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నకిలీ పత్రాలు సృష్టించి ఉద్యోగాలు సాధించినట్లు తమ దృష్టికి వచ్చింది. ఈ విషయమై విచారణ చేపట్టాలని స్థానిక తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశాం.

– వినోద్‌కుమార్, ఆర్డీవో

ఎస్టీపీపీకి పలు విభాగాల్లో బహుమతులు


బహుమతి అందుకుంటున్న అధికారి శ్రీనాథ్

జైపూర్: ప్రపంచ భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని డిపార్టుమెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎట్ వర్క్ అనే కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీపీపీ సేఫ్టీ బృందం రెండు బహుమతులు గెలుపొందింది. సేఫ్టీ పోస్టర్ డ్రాయింగ్ కాంపిటీషన్‌లో శ్రీనాథ్ బహుమతి గెలుపొందగా, ఎస్టీపీపీ నాటిక బృందం రక్షణపై అవగాహన కల్పిస్తూ నాటికను ప్రదర్శించగా మరో బహుమతి గెలుపొందింది. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్‌రావు, డాక్టర్ సంజయ్ చతుర్వేది, హేమచంద్ర చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. డీజీఎం పంతులా, ఎస్ఈ సేఫ్టీ సురేశ్, డివైఎస్సీ శ్రీనాథ్, పవర్‌మేక్ సేఫ్టీ అధికారి శ్రావణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

కుంటాల: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26, 27, 28 తేదీల్లో రాజన్న సిరిసిల్లలో వుషు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. కుంటాలలోని విజయసాయి పాఠశాల విద్యార్థి జాదవ్ ఆర్యన్ సబ్‌జూనియర్ వుషు ఛాంపియన్ పోటీల్లో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. తమిళనాడులోని తిరుచెంగోడేలో మే 26 నుంచి 31 వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సారంగపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన తొండకూరి సాయన్న (45) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో నిర్మల్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఆటోను అతివేగం, అజాగ్రత్తగా నడపడం వల్ల కౌట్ల(బి) శాంతినగర్ మూలమలుపు వద్దకు చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయం కాగా 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.


సాయిన్న మృతదేహం

అనారోగ్యంతో బాలింత..

కాసిపేట: అనారోగ్యంతో బాలింత మృతిచెందింది. మండలంలోని మల్కేపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మల్కేపల్లికి చెందిన పెరుగు రజిత(28), వెంకటేశ్ భార్యభర్తలు. పెళ్లయినప్పటి నుంచి రజిత సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతోంది. ఈనెల 8న కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రిలో రెండో కాన్పులో ఆమె బిడ్డకు జన్మనిచ్చింది. వారం రోజులు ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి వచ్చింది. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆస్పత్రిలో ఉండగానే మూడుసార్లు గుండె పోటు వచ్చినట్లు కుటుంబ సభ్యులు వైద్యులతో వాదనకు దిగినట్లు సమాచారం.


రజిత (ఫైల్)

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు..


బాలస్వామి(ఫైల్)

నెన్నెల: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతిచెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..మండలంలోని కొత్తగూడం గ్రామానికి చెందిన యువకుడు దుర్గం బాలస్వామి(26) వ్యవసాయ పని కోసం తన సొంత ట్రాక్టర్‌తో సోమవారం నెన్నెలకు వస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఒక్కసారిగా స్టీరింగ్ అదుపు తప్పి బోల్తాపడింది. ట్రాక్టర్ కింద బాలస్వామి శరీరం మొత్తం ఇరుక్కుపోయింది. గ్రామస్తులు వచ్చి అతడిని బయటకు తీసి 108లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తమ్ముడు జీవన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య ప్రసన్న, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పల్సితాండకు చెందిన జాదవ్ మనోజ్ (38) రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు టూటౌన్ ఏఎస్సై ఖైసర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనోజ్ మనస్తాపం చెంది ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌లో ఉదయం చేర్పించగా, రాత్రి మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య జయశ్రీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య


వివరాలు సేకరిస్తున్న ఎస్సై మనోహర్

ఉట్నూర్‌రూరల్: తండ్రి మందలించాడని కొడుకు షుగర్ మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలో ఈఘటన చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. ఉట్నూర్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన చౌహాన్ రాంకుమార్ కుమారుడు చౌహాన్ సాయి (20) ఇంటర్ పూర్తి చేశాడు. అప్పటి నుంచి ఖాళీగా ఉంటున్నాడు. ఏదైనా పని చేసుకోవాలని తండ్రి మందలించాడు. క్షణికావేశంలో ఈనెల 26న రాత్రి ఇంట్లో అధిక మోతాదులో షుగర్ మాత్రలు మింగాడు. ఆపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు గమనించి ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. తండ్రి రాంకుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పులు తీర్చలేక యువకుడు..

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామానికి చెందిన యువకుడు పిట్లెవాడ్ లక్ష్మణ్ (25) అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి కథనం ప్రకారం ..లక్ష్మణ్ గత రెండేళ్ల క్రితం రూ.2 లక్షల అప్పు తీసుకుని ఫైనాన్స్‌పై ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. కిరాయికి ట్రాక్టర్ నడవకపోవడంతో ఫైనాన్స్ కిస్తీలు కట్టలేదు. దీంతో ట్రాక్టర్‌ను అమ్మి కిస్తీలు కట్టాడు. గతంలో తీసుకున్న రూ.2 లక్షల అప్పు ఎలా తీర్చాలనే బెంగతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం అర్ధరాత్రి అందరు నిద్రపోయాక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న ట్రెయినీ ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల్లి లక్ష్మిబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


లక్ష్మణ్ (ఫైల్)

కర్రెగుట్టలో కూంబింగ్ ఆపాలి

ఉట్నూర్‌రూరల్: కేంద్రప్రభుత్వం చర్చలకు స్పందిస్తే మేము కూడా సిద్ధమేనని సీపీఐ మావోయిస్టు పార్టీ ప్రకటించినందున కర్రెగుట్టలో చేపట్టిన పోలీసుల కూంబింగ్ ఆపాలని శాంతి చర్చల కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఆత్రం భుజంగ్‌రావు, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ బానోత్ రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తున్నామని తెలిపారు. 'ఆపరేషన్ కగార్'అంతర్యుద్ధాన్ని కేంద్రం మానుకోవాలన్నారు. నక్సలైట్ల హింసలో, పోలీసుల ఎన్‌కౌంటర్‌లో, ఉగ్రవాదుల కాల్పుల్లో సామాన్య ప్రజలు సమిధలు అవుతున్నారన్నారు. కర్రెగుట్టలో పోలీసులు చేపట్టిన కూంబింగ్‌తో ఆదివాసీ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. పోలీసుల కాల్పుల చర్యలను విరమించుకోవాలని, శాంతి చర్చలకు అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో నేతావత్ రాందాస్, బండి విజయ్‌కుమార్, దిలేశ్ చౌహాన్, జాదవ్ రాంకిషన్, పవార్ గంగారాం నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భుజంగ్‌రావు, రామారావు

వేసవిలో జీవాలు పైలం

- మేత, దాణా సరిపడా అందించాలి
- జాగ్రత్తలు తప్పనిసరంటున్న పశువైద్యాధికారి సతీశ్


సతీశ్, పశువైద్యాధికారి, కత్తెరసాల

చెన్నూర్‌రూరల్: వేసవిలో పాడి పశువులు, జీవాల పోషణపై జాగ్రత్తలు తీసుకోవాలని కత్తెరసాల పశువైద్యాధికారి సతీశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటల్లో.. పాడి పశువులకు వేసవిలో మేత, దాణాను సరిపడా అందించాలి. పచ్చిమేత దొరకని సమయంలో ఎండుమేత దీంతోపాటు ఎక్కువగా దాణాను ఇవ్వాలి. పశువులకు ఎల్లవేళలా పరిశుభ్రమైన చల్లని నీరు లభించేలా చూడాలి. మేత, నీరు సరిపడా ఉంటే పాడి పశువులు వేసవిలో కూడా పాలు బాగా ఇస్తాయి. ఎదకొచ్చి చూలు కడుతాయి. వేసవిలో పాల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈ సమయంలో పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటే పాడి పరిశ్రమకు లాభదాయకం. దీనికోసం పశువుల షెడ్లు(కొట్టాల) వద్ద చల్లని వాతావరణం ఉండేలా చూడాలి. వీలైతే షెడ్లు(కొట్టాల)పై గడ్డిని కప్పి ఉంచాలి. షెడ్ల చుట్టూ తడికెలు, గోనె సంచులు కట్టి వాటిపై నీళ్లు చల్లాలి. పశువులపై మధ్యాహ్నం రెండు, మూడుసార్లు నీళ్లు చల్లితే మంచిది. గేదెలను చెరువులకు పంపి మధ్యాహ్నం కొంతసేపు అందులో ఉండనివ్వాలి. కొట్టాల చుట్టూ పెద్ద చెట్లు ఉంటే లోపల చల్లగా ఉంటుంది. ఈ పద్ధతుల్ని పాటిస్తే పాలు ఎక్కువగా ఉండటమే కాకుండా పశువులు ఎదకొచ్చి చూడి కడుతాయి. అలా అవి సంవత్సరం పాడవునా ఈని పాలిచ్చే అవకాశం ఉంటుంది. సాయంత్రం పాలు పితికే ముందు పశువును, పొదుగును చల్లని నీటితో కడిగితే మంచిది.


ఎండలో ఉన్న జీవాలు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వేసవిలో గొర్రెలు, మేకల్ని జత కలిపి చూడి కట్టించాలి. మూడు నెలల వయసు దాటిన పిల్లలను తల్లుల నుంచి వేరుచేయాలి. పిడుదులు, గోమార్లు లేకుండా మూడు వారాలకోసారి మందు కలిపిన నీటిలో గొర్రెలను తడిపి తీయాలి. అమ్మతల్లి(బొబ్బ, మశూచి) టీకాలు, చిటుక రోగం టీకాలను పిల్లలకు తప్పకుండా వేయించాలి. మధ్యాహ్నం పూట ఎండ వేడిమికి మేతకు బయట మేపకపోవడం మంచిది. బయట మేసే సమయంలో చెట్ల నీడ, తాగునీటి సదుపాయం ఉండేలా చూసుకోవాలి. నట్టల నివారణ మందులను పశువైద్యుడి సలహా మేరకు వినియోగించాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే వేసవిలో పశువులను, జీవాలను కాపాడుకోవచ్చు.

గిరిజనుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి


అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఖుష్బూ గుప్తా స్వీకరించారు. అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. పెంబి మండలం గుమ్మనా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని టేకం భీంరావ్, తాండూర్ మండలం కిష్టంపేట గ్రామస్తులు తమ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, ఏవో దామోదర స్వామి, ఈఈ తానాజీ, పీహెచ్‌వో సందీప్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మైనర్ బాలుడు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన 14 ఏళ్ల మైనర్ బాలుడు పదేళ్లలోపు ఇద్దరు బాలురు, ఒక బాలికను నిర్బంధించాడు. తన నివాసానికి తీసుకెళ్లి తలుపు పెట్టి నిర్బంధించినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఆ ముగ్గురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మైనర్ బాలుడిని అదుపులో తీసుకుని సోమవారం జువెనైల్ కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కిడ్నాప్ కేసుతోపాటు అక్రమ నిర్బంధం, పోక్సో కేసు, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

- సీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్: సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు కంపెనీ దవాఖానాల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ) కిరణ్ రాజ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. ఆర్కే 8 డిస్పెన్సరీ, నస్పూర్ డిస్పెన్సరీ, మందమర్రిలోని కేకే డిస్పెన్సరీ, రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రులను సందర్శించారు. వార్డులను సందర్శించి వైద్య సేవలు, చికిత్సపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌తో కలిసి వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వేసవి దృష్ట్యా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత వచ్చిన ఆయనను ఆయా ప్రాంతాల్లో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఫైనాన్స్) బీభత్సా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీవైసీఎంఓ రమేశ్‌బాబు, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, పర్చేస్ అధికారి చంద్రశేఖర్, వైద్యులు వేద వ్యాస్, మురళీధర్, లోక్నాథ్ రెడ్డి, ఎస్టేట్ అధికారి వరలక్ష్మి, ఐఈడీ ఎస్ఈ కిరణ్ కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.


డిస్పెన్సరీని తనిఖీ చేస్తున్న కిరణ్ రాజ్‌కుమార్

ఉద్యోగులకు వైద్యసేవలు

జైపూర్: పవర్ ప్లాంట్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆవరణలో డిస్పెన్సరీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిస్పెన్సరీలో వసతులు, ఉద్యోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్ రవీందర్, శ్యామల ఉన్నారు.

హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్‌అర్బన్: హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదుతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ. రమేశ్ తీర్పునిచ్చారు. తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని ఉల్లిపిట్ల గ్రామానికి చెందిన బోరకుంట మల్లయ్య (65) వ్యవసాయం చేస్తూ తనకు ఉన్న పాత ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. అతనికి ముగ్గురు కుమారులు శ్యాంరావ్, సోమయ్య, గణపతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తనకు ఉన్న ఐదెకరాల్లో 2.5 ఎకరాలు ముగ్గురు కుమారులకు సమానంగా పంచారు. కుమారుడు సోమయ్య తండ్రి పేరిట ఉన్న 2.5 ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. తండ్రిని పోషిస్తూ మిగిలిన డబ్బులు ఇస్తున్నాడు. చిన్న కుమారుడు గణపతి వృత్తిరీత్యా మహారాష్ట్రలో నివాసం ఉంటున్నాడు. తన అవసరాల నిమిత్తం అప్పుడప్పుడు స్వగ్రామానికి వస్తూ వెళ్తుండేవాడు. తండ్రి పేరిట ఉన్న భూమిని ఎప్పటి నుంచో ఆశిస్తున్నాడు. భూమి ఇవ్వకుంటే తండ్రిని చంపేస్తానని, బాబాయ్ అయిన పాపయ్యకు చెప్పేవాడు. 2022 ఏప్రిల్ 18న తండ్రితో గొడవపడి, ఆస్తి పంచి ఇవ్వలేదని కోపంతో కర్రతో కొట్టి హత్యచేశాడు. శ్యాంరావ్ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై రమేశ్ కేసు నమోదు చేశారు. రెబ్బెన సీఐ బుద్దె స్వామి, తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ జగన్మోహన్‌రావ్ నేరం రుజువు చేశారు. నిందితుడు గణపతికి శిక్ష ఖరారు చేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పీపీతోపాటు, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైసెనింగ్ రాంసింగ్, ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ, ఎస్సై, కోర్టు సిబ్బంది కానిస్టేబుల్ వినోద్‌లను ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు అభినందించారు.

తప్పుడు సర్టిఫికెట్ పొందిన వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి: తప్పుడు నివాసం సర్టిఫికెట్ పొందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మనోజ్ షెకావత్.. సహస్ర సీమ బాల్ (ఎస్ఎస్‌బీ)లో ఉద్యోగం కోసం 2023లో ఇంద్రవెల్లిలో నివాసం ఉంటున్నాడు. కొందరి సహకారంతో నివాసం సర్టిఫికెట్ పొందాడు. అధికారులు రీ వెరిఫికేషన్‌లో ఇక్కడ నివసించలేదని తేలడంతో అతనిపై సుమోటోగా సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అతనికి సహకరించిన వారిపై విచారణ చేపడుతామన్నారు.